# కనకపు సింహాసనమున..

దాదాపు ముప్ఫై ఆరేళ్ళ క్రితం అనుకుంటాను ఒకసారి హైద్రాబాద్ వెళ్ళినప్పుడు మా శ్రీధర్‌తో కలిసి శ్రీరామశర్మగారింటికి వెళ్ళాను, నా ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా. గేటు తీసుకుని లోపలికి వెళ్ళగానే, భౌభౌమని పెద్దగా అరుస్తూ బయటికి వచ్చింది ఒక పెద్ద ఆల్సేషియన్ కుక్క. నాకు కుక్కలంటే మొదట్నించీ భయమే కాకుండా ఒక విధమైన చిరాకు కూడా. అందులోనూ అంత పెద్ద కుక్క భయంకరంగా అరుస్తూ మీదకి వచ్చేసరికీ వణుకుతో చెమటలు పట్టాయి. ఆ రోజు ఆ కుక్కవల్ల ఉద్యోగం రాకముందరే, నా జీవితానికి శెలవు దొరుకుతుందేమోనని అనిపించింది.

"అరిచే కుక్కలు కరవవురా.. సామెత వినలేదూ... పద" అన్నాడు శ్రీధర్.

పరుగెత్తుకుంటూ దగ్గరికి వచ్చిన కుక్క నాలిక బయట పెట్టి, నా కాలు నాకటం మొదలుపెట్టింది. కాస్త భయం తగ్గినా, నాకు ముళ్ళపూడి వెంకటరమణగారి జోక్ వెంటనే గుర్తుకి వచ్చింది. శ్రీధర్‌తో అనలేదు కానీ, "ఆ సామెత నీకు తెలుసు, నాకు తెలుసు ఆ కుక్కకి తెలుసా" అని అడగాలనిపించింది.

దాని వెనకనే బయటికి వచ్చిన శర్మగారు నవ్వుతూ "వాడేం చేయడు. భయపడకండి. జానీకి వంకాయకూర, మామిడికాయ పప్పు, గోంగూర పచ్చడి తప్ప ఇంకేం పెట్టదు మా ఆవిడ. వాడు పూర్తిగా శాకాహారి. మా ఆవిడ తరహా చూస్తుంటే, ఇంకో ఆరు నెల్లల్లో వాడికి ఉపనయనం కూడా చేస్తుందేమో " అన్నారు. అది దాని మెడ దగ్గర చేత్తో ప్రేమగా రుదుత్తున్నారు.

కుక్కల్ని మిగతా జంతువుల్ని గురించి చెప్పేటప్పుడు స్త్రీలింగంలో వినటం అలవాటయిన నాకు, ఆయన వాడు, వాడికి అంటుంటే కొత్తగా వుంది.

తరువాత, వసంత కోకిల సినిమాలో అనుకుంటాను, శ్రీదేవి తన కుక్కకి సుబ్రమణ్యం అని పేరు పెట్టుకుని, పుంలింగంలోనే పిలుస్తుంటుంది.

తర్వాత అమెరికా వచ్చాక కానీ, కుక్కల్నీ పిల్లుల్నీ ఎంత ప్రేమగా చూస్తారో అర్ధంకాలేదు. మా ఆఫీసులో బ్రేక్ రూమ్ సంభాషణలు మామూలుగా ఐదు విషయాలమీద జరిగేవి. ఒకటి వాతావరణం, రెండు వారాంతం వాళ్ళింట్లో పెయింటింగ్ లాటివి ఏం పనులు చేస్తున్నారో అవి, మూడు పిల్లల గురించీ, నాలుగు బాస్కెట్ బాల్, బేస్‌బాల్, ఫుట్‌బాల్‌లాటి ఆటల గురించీ, ఐదు వారి పెంపుడు జంతువుల

గురించీ. నేను మాత్రం ఈ కుక్కల కబుర్లు అసలు పట్టించుకునే వాణ్ని కాదు.

అందులోనూ కొంతమంది పిల్లుల గురించీ కొంతమంది కుక్కల గురించీ. మొదట్లో, ఏమిటి పెంపుడు జంతువులంటే వీళ్ళకి ఇంత పిచ్చి అనుకునే వాడిని. తర్వాత తర్వాత అర్థమయింది, వాళ్ళకి అవంటే నిజంగా ఎనలేని ప్రేమ అని.

కొంచెం పరిశీలనగా చూస్తే, పిల్లులకీ కుక్కలకీ ఒక పెద్ద తేడావుంది. పిల్లులు ఒక స్థలానికి అలవాటు పడి, అక్కడే వుండటానికి ప్రయత్నం చేస్తాయి. కానీ కుక్కలు తమ యజమానికి అలవాటుపడి యజమానితోనే వుండటానికి ప్రయత్నం చేస్తాయి. మన పేపు పొయ్యిలో పిల్లి కూడా లేవదు అని ఒక సామెత వుంది. అంటే యజమానులు ఇంట్లో వున్నా లేకపోయినా తిండి దొరికినా దొరక్కపోయినా అవి మాత్రం ఇల్లు వదిలి ఎక్కడికీ పోవని. అలాగే హిస్ మాష్టర్స్ వాయిస్ వాళ్ళు కూర్చున్న ఒక కుక్కపిల్లని వాళ్ళ ఎంబ్లెమ్‌గా వాడుకుంటున్నారు.

మా ఎదురింటి లిండా సాయంత్రం ఆఫీసునించీ వచ్చి, గరాజ్ డోర్ తెరుస్తుండగానే, వాళ్ళ కుక్క పరుగుత్తుకుంటూ వచ్చి ఆవిడ చంక ఎక్కుతుంది. ఆవిడ కుక్కకి ముద్దులు పెట్టేస్తుంది. ముద్దులంటే మెడమీద కాదు నోటిమీద. అది చూస్తుంటే మొదట్లో ఎబ్బెట్టుగా వుండేది. కానీ తర్వాత అలవాటయిపోయింది.

కొంతమంది అమెరికన్లు ఈ జంతువుల్ని పిల్లలు పుట్టకముందు పెంచుకుని వాటి మీద తమ ప్రేమ అంతా చూపిస్తుంటే, కొందరు తమ పిల్లల ఆనందం కోసం పెంచుకుంటారు. పిల్లలు పెరిగి పెద్దయి ఇల్లు వదిలి వెళ్ళిపోయాక, ఇక ఏమీ తోచక పెంపుడు జంతువుల్ని దగ్గరికి తీసేవారు మరి కొందరు.

మా సుబ్బారావు కూడా ఒక కుక్కని పెంచుకుంటున్నాడు. చెప్పొద్దూ వాళ్ళింటికి వెళ్ళాలంటే నాకంత మనసొప్పేది కాదు. సోఫాలోనూ సోఫాలోని దిళ్ళ మీదా కుక్క వెంట్రుకలు. అతను టామీని ఎత్తుకుని, నాకు సమోసాల ప్లేట్ అందిస్తుంటే అవి తిన బుద్ధి వేసేది కాదు. ఒకవేళ తిన్నా, సమోసాలమీద కుక్క వెంట్రుకలున్నాయోమో క్షుణ్ణంగా చూసి తినేవాడిని. కుక్కని ఒళ్ళో కూర్చో బెట్టుకుని ఆయన సోఫాలో కూర్చుంటే, నేను దూరంగా వేరే కుర్చీలో కూర్చునేవాడిని.

మా అమ్మాయి ఎలిమెంటరీ స్కూల్లో చదువుతున్నప్పటినించీ, నాన్నా మనమూ ఒక కుక్కని పెంచుకుందామా అని అడుగుతూనేవుంది. నేను వద్దని వారిస్తూనే వున్నాను. ఈలోగా కాలేజీలో ఎంఎస్ కూడా పూర్తి చేసింది. మధ్యమధ్యలో అడిగినా, నాధోరణి చూసి అడగటం కూడా మానేసింది.

ఉద్యోగంలో చేరి రెండు మూడు నెలయిందేమో, ఒక శనివారం ప్రొద్దున్నే తన ఎపార్ట్మెంట్‌నించీ ఫోన్ చేసింది మా అమ్మాయి.

"ఇవాళ లంచ్ మా ఎపార్ట్‌మెంట్‌లో చేద్దాం. నేనివాళ మాకరోనీ కొనుక్కు వచ్చాను. నువ్వు మాకరోనీ ఛీజ్ ఇండియన్ స్టైల్లో చేస్తావా. ఇక్కడే తిందాం"

నేనూ శ్రీమతీ పన్నెండు గంటలకల్లా ఎపార్ట్‌మెంట్‌కి వెళ్ళాం. కాలింగ్ బెల్ కొట్టగానే, భౌ భౌ మని అరుపులు వినపడ్డాయి.

మేము ఒకళ్ళ ముఖం ఒకళ్ళు చూసుకుండగానే, తలుపు తీసింది. చేతిలో

చాల చిన్న తెల్లటి కుక్క పిల్ల.

"చిన్నీ! మీట్ యువర్ గ్రాండ్ ఫాదర్ అండ్ గ్రాండ్ మదర్. నాన్నా! హియరీజ్ చిన్ని. యువర్ గ్రాండ్ సన్" అంది మా అమ్మాయి.

చిన్ని మా ఆవిడ మీదకి దూకింది. పిల్లి పిల్లకన్నా చిన్నదిగా వుంది.

"వీడు పుట్టి సరిగ్గా నెలరోజులే అయింది. పేథవ. అప్పుడే బాగా గోల మొదలుపెట్టాడు. మాల్టీజ్ బ్రీడ్. చాల తెలివి, ప్రేమా, ఎక్కువ ఈ మాల్టీజ్ కుక్కలకి. గారాబం చేయాలి..." అంది మా అమ్మాయి.

"నెల రోజులంటే మనుష్యుల సంవత్సరాల్లో ఏడు నెలలన్న మాట. చాల బాగుంది... చిన్ని.." అంది శ్రీమతి మురిసిపోతూ.

"నీకు కుక్కలంటే ఇష్టమని నాకసలు తెలీదే.." అన్నాను.

"దీన్ని చూశేదాకా నాకూ తెలీదు.. ఎంత ముద్దొస్తున్నదో..."

"ముద్దొస్తుంది కాదమ్మా! ముద్దొస్తున్నాడు అనాలి. వీడు మగాడు"

"మరి చిన్ని అని ఆడ పేరు ఎందుకు పెట్టావ్?" అడిగాను.

పకపకా నవ్వింది. "వాడి మెళ్ళో బిళ్ళ చూడు. దాని మీద వుంటుంది పూర్తి పేరు" అంది.

అవును. దాని.. వాడి పేరు చిన్ని రాజా. మొదటి ఉద్యోగంలోనే మూడు నెలలు డబ్బులు ఆదా చేసుకుని, చిన్నిని కొనుక్కుంది.

చిన్ని గబుక్కున నామీదికి దూకి నా ముఖం వేపు దీక్షగా అమాయకంగా చూస్తున్నాడు. వాడి ముఖం చూస్తుంటే నవ్వుతున్నాడేమో అనిపించింది.

* * *

"చిన్ని ఎంత గోల చేస్తాడో! నేను కనపడకపోతే ఒక్కరోజు కూడా వుండలేడు. మా అమ్మాయి మా ఇంటికి రాగానే గబగబా ఇల్లంతా చుట్టిపెడతాడు. నేను కంప్యూటర్ దగ్గర పని చేసుకుంటుంటే, నా ఒళ్ళోనే కూర్చుంటాడు. నా పక్కనే నా మంచం మీద నాతోనే పడుకుంటాడు. అల్లరి చేసినా, మంచి క్రమశిక్షణ వుంది వాడిలో....." మా ఆఫీసులో బ్రేక్ రూమ్‌లో కూర్చుని ఇలా చెబుతుంటే, అందరూ నన్ను వింతగా చూశారు.

ఒకరోజు సాయంత్రం నేను చిన్నిని తీసుకుని, మా ఇంటి ముందర నడుస్తుంటే దారిలో ఆగి, మొండికేసి ముందుకు నడవటం లేదు.

"చిన్నీ! రారా.... పోదాం పద..." అని తెలుగులో ప్రేమగా పిలవగానే, వాడు నాకేసి వస్తుంటే, "అప్పుడే మీ ఇండియన్ భాష నేర్పేశావ్.. చిన్ని అంటే ఒకటే గారాబం చేస్తున్నావ్.. సో యు ఆర్ ఎంజాయింగ్ ది కంపెనీ ఆఫ్ చిన్ని..." అంది ఎమిరెంటి లిండా నవ్వుతూ.

నడుస్తూ అలిసిపోయిన చిన్నిని ఎత్తుకుంటూ, ఆవిడ వేపు చూసి చిరునవ్వు నవ్వాను.

* * *